www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 20 జనవరి 2024



గణతంత్ర వేడుకల ఏర్పాట్లు వేగవంతం చేయాలి : జెసి

కడప : 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు చేయాల్సిన ముందస్తు ఏర్పాట్ల పురోగతిపై డిఆర్ఒ గంగాధర్ గౌడ్, ఎఎస్‌పి కృష్ణారావుతో కలసి అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న స్థానిక పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకల్లో జెండా వందన కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు ఎంత వరకు వచ్చాయని ఆరా తీశారు. శకటాలను ఏవిధంగా ఏర్పాటు చేస్తున్నారు, యాక్షన్ ప్లాన్ పై వివరించాలని అడిగారు. స్టాళ్లను ఆకర్షణీయంగా, వినూత్నంగా ఏర్పాటు చేయాలన్నారు. వేదికను అందంగా అలంకరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజా ప్రతినిధులు, స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబ సభ్యులు, ఇతర అతిథులను వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించాలని, ఆదేశించారు.

మైదుకూరులో చెవిలో పూలు.. చేతిలో చిప్పతో నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు



చెవిలో పూలు.. చేతిలో చిప్ప

మోకాళ్లపై నిల్చుని అంగన్వాడీల నిరసన
అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం
39వ రోజూ కొనసాగిన సమ్మె

ప్రజాశక్తి - కడప అర్బన్

అంగన్వాడీల ఆందోళన శిబిరం నుంచి కలెక్టరేట్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా నినాదాలు చేస్తూ తమ కనీస వేతనం పెంపుదల చేయాలని, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం గ్రాట్యుటీని చెల్లించాలని నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగ సుబ్బారెడ్డి మాట్లాడుతూ 39 రోజులుగా సమ్మె చేస్తున్నటువంటి అంగన్వాడీ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోగా మరింత జఠిలం చేసేలాగా ప్రభుత్వ వైఖరి ఉందని విమర్శించారు. వెంటనే వాళ్ళ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అంగన్వాడీ యూనియన్ల రాష్ట్ర నాయకత్వాలు నిరవధిక దీక్షకు సైతం కూర్చొని ఉన్నారని వారి ఆరోగ్యాలు దృష్టిలో పెట్టుకుని వారి యొక్క డిమాండ్లు పరిష్కరించి సమ్మెను పరిష్కరించవలసిందిగా కోరారు. దీనిని బట్టి మా సేవలు ఎంత ప్రయోజనకరమైనవో తెలుసుకోవాలని ప్రభుత్వ యంత్రాంగానికి సూచించారు. వేతనాలు పెంచమంటే నోటీసులు ఇస్తారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రారెడ్డి, పి. వెంకటసుబ్బయ్య, ఎఐటియుసి జిల్లా నాయకులు బాదుల్లా, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు వసుంధర, పోలమ్మ, సిఐటియు నాయకులు పవన్, గిరి, రమణ పాల్గొన్నారు. **మైదుకూరు :** ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అంగన్వాడీ అక్క చెల్లెళ్లకు చెవిలో పువ్వు చేతిలో చిప్ప పెట్టాడంటూ అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు నిరసన చేపట్టారు. శుక్రవారం స్థానిక సిడిపిఒ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేస్తున్న సమ్మె 39వ రోజుకు చేరుకుంది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు రూ. 26వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమ్మెకు ఎస్ఎఫ్ఐ జిల్లా జాయింట్ సెక్రెటరీ అజయ్ మద్దతు తెలిపారు సమ్మెలో సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, అంగన్వాడీ నాయకురాలు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** విజయ వాడలో నిరవ ధిక నిరాహార దీక్షలు చేస్తున్న అంగన్వాడీలకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా సిఐటియు, ఏఐటియుసి ఆధ్వర్య ంలో అంగన్వాడీ వర్కర్ల సమ్మె 39వ రోజు సందర్భంగా మోకాళ్లపై నిల్చొని తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు లక్ష్మీదేవి, గీత, నిర్మల, సుబ్బలక్ష్మి, విజయ, గురుదేవి, శివమ్మ పాల్గొన్నారు. మున్సిపల్ యూనియన్ కార్యదర్శి రాఘవ మద్దతు తెలిపారు. **కలసపాడు :** పోరుమామిళ్ల అంబేద్కర్ సర్కిల్ వద్ద నిర్వహిస్తున్న అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా ఎపిటిఎఫ్ నాయకులు లిలంగారెడ్డిపల్లి ఉపా ధ్యాయులు బాలజోజి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి బైరవప్రసాద్, అంగన్వాడీ యూనియన్ నాయకులు, మేరీ, రమాదేవి, కార్మికులు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి సిఐటి యు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్ దగ్గరికి వెళ్లి షోకాస్ నోటీసు బదులుగా సమాధాన నోటీసు తీసుకెళ్లారు. అంగన్వాడీలను భయభ్రాంతులును చేసి మభ్యపెట్టి విధుల్లో చేర్చుకున్న సిడిపిఒను వెంటనే సస్పెండ్ చేయాలని అంటూ అంగన్వాడీలు అంబేద్కర్ సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. భైరవ ప్రసాద్ పోరుమామిళ్ల ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి మేరీ కార్యదర్శులు మేరి, వినోదాదేవి, పోరుమామిళ్ల మండల నాయ కురాలు జ్యోతిమ్మ ,రేణుక, సుదా,స్వాతి, రమాదేవి ,శ్రీదేవి, 250 మంది అంగన్వాడీలు పాల్గొన్నారు. **చాపాడు :** తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు శుక్రవారం తహశీల్దార్ కార్యాల యం వద్ద తమ నిరసనను తెలియజేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు : మోకాళ్లపై నిల్చుని నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు



కడప : అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

ఉద్యోగులను వంచించిన జగన్ సర్కార్ : యుటిఎఫ్



కడపలో ర్యాలీ నిర్వహిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు బాకీపడ్డ ఆర్థిక బకాయిల చెల్లింపులో అలసత్వం వీడాలని, ఐఆర్ 30శాతం పిఆర్‌సి విధివిధానాలు, పాత పెన్షన్ విధానం ప్రకటించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాళెం మహేష్ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మహావీర్ సర్కిల్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు 'చెవిలో పువ్వులతో' ర్యాలీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రతిపక్ష నేతగా పాదయాత్ర సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని చెప్పారు. ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగంపై సవతి తల్లి ప్రేమ చూపి స్తోందని ఉపాధ్యాయుల పట్ల వివక్ష చూపిస్తూ వారికి న్యాయ బద్ధంగా రావాల్సిన ఆర్థిక బకాయిలను అందించకుండా కక్షపూరి తంగా వేధింపు ధోరణితో ముందుకు వెళ్లడం మంచిది కాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానం పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు ఎ.శ్రీనివాసులు, ఏజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, సిపిఎస్ కో-కన్వీనర్ అయ్యవారు రెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, గాజులపల్లె గోపీనాథ్, పోతురాజు చంద్రశేఖర్, శివశంకర్, సమీర్ బాష, బత్తుల చంద్రశేఖర్,కిరణ్ కుమార్,మురళీధర్ రాజు, హమీద్,సూర్య కుమార్, మజ్జారి చెన్నకేశవులు, జానకిరామ్, సుబ్బారెడ్డి, మల్లికార్జున, మామిళ్ళ శ్రీనివాసులు రెడ్డి,శ్రీకాంత్, కిరణ్ బాబు, అనిల్ కుమార్,విశ్వనాథ్, లక్ష్మయ్య,సుబ్బారావు, భాస్కర్ రావు, సి వి ఎస్ ఎన్ బాబు, వెంకటసుబ్బయ్య, ప్రధానో పాధ్యాయులు గంగన్న, రమణయ్య, పాండురంగారావు, ఎం శ్రీనివాసులు, ఓబులేసు శివకుమార్ రాజు, స్వతంత్ర బాబు,సి శ్రీనివాసులు, దేవ దత్తం, ఎస్సీ ఎస్టీ రాష్ట్ర అధ్యక్షులు మేకల శివార్జున జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాజు జిల్లా కార్యదర్శి గంగాధర్ పాల్గొన్నారు. **బద్వేలు** ఉద్యోగ, ఉపాధ్యాయులను అన్ని రకాలుగా జగన్ సర్కార్ వంచిందని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్.ఓబుల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బద్వేలులోని ఆర్‌డిఒ కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో చెవిలో పూలు పెట్టుకుని వినూత్నంగా నిరసన చేపట్టారు. కార్యక్రమంలో బద్వేలు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.దేవానందం, కె.సుధాకర్, సహాధ్యక్షులు ఎం.నరేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎస్.చెన్నయ్య, పి.చక్రపాణి, పాలా శ్రీనివాసులరెడ్డి, పి.మస్తాన్ రెడ్డి, టి.శివ ప్రసాద్, కె.ఈశ్వరయ్య, ఓబన్న, డి.ప్రభాకర్ రాజు, లాజరయ్య, పి.సుబ్ర హ్మణ్యం, పి.విశ్వనాథ రెడ్డి, యు.నరేంద్ర, ఎం.బాబు, వెంకటరమణ పాల్గొన్నారు **మైదుకూరు :** ఉద్యోగ ఉపాధ్యాయులకు 'జగన్ అన్న చెవిలో క్యాలీఫ్లవర్ పెట్టాడు' అంటూ యుటిఎఫ్ నాయకులు వినూత్నంగా శుక్రవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద చెవిలో క్యాలీఫ్లవర్ పెట్టి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వై.రవికుమార్, మండల సహా అధ్యక్షులు రాము, శ్రీనివాసులు, రమణారెడ్డి, ప్రతాపరెడ్డి, పీ.శ్రీనివాసులు, పోతులూరయ్య, తిరుపాలయ్య, వై.శ్రీనివాసులు, సిడి బాషా, అన్వర్, హుస్సేన్, నజీర్‌బాషా పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** ఉద్యోగ ఉపాధ్యాయ సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కుర్రా చెన్నయ్య పేర్కొన్నారు. శుక్రవారం యుటిఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు పోరుబాటలో భాగంగా డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర మాజీ కౌన్సిలర్ చేరామయ్య, మండల అధ్యక్షులు ఈశ్వరరావు, సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, చెన్నకృష్ణయ్య, సిద్దయ్య, సింహరాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మైదుకూరు : చెవిలో క్యాలీఫ్లవర్ పెట్టుకుని నిరసన తెలియజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

రా.. కదలిరా బహిరంగ సభలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు



పులివెందులలో టిడిపి
జెండా ఎగురవేస్తాం

- 'ఉక్కు' ఏర్పాటులో అలసత్వం
- 'సీమ'ను రతనాలసీమగా మారుస్తా
- కడప హజ్‌హౌస్ పనుల్లో నిర్లక్ష్యం
- భూ కబ్జాదారులను వదలబోం
- కమలాపురం రా..కదలిరా సభలో చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అంతులేని నిర్లక్ష్యం వహించడం దారుణమని టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు విమర్శించారు. శుక్రవారం ఆయన జిల్లాలోని కమలాపురం నియోజకవర్గ కేంద్రంలో టిడిపి ఇన్‌ఛార్జి పుత్తా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రా..కదలిరా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప స్టీల్‌ప్లాంట్, సాగు నీటి ప్రాజెక్టు, డ్రిప్‌ఇరిగేషన్ ప్రాజెక్టు పనుల్లో ఎటువంటి పురోగతీ లేకుండా పోయిందన్నారు. మాటలు కోటలు దాటాయని, చేతలు గడప దాటడం లేదని విమర్శించారు. తాను అధికారంలో ఉంటే ఖరీఫ్, రబీ సీజన్‌లో నష్టపోయిన నేపథ్యంలో కరువు మండలాలుగా ప్రకటించే వాడినని తెలిపారు. సాగర్ నీటిని నల్లమలలో టన్నెల్ తవ్వి బనకచర్లలో పోసి రాయలసీమ తలరాతనే మార్చేస్తానని తెలిపారు. జిల్లాలో పది ఎమ్మెల్యే, రెండు ఎంపీ సీట్లను ఇచ్చినప్పటికీ ప్రజల జీవితాల్లో ఎటువంటి మార్పూ రాలేదని తెలిపారు. మళ్లీ అన్ని సీట్లు ఇచ్చి గెలిపిస్తారా తమ్ముళ్లూ అని ప్రశ్నించారు. ఈదఫా పులివెందుల్లో టిడిపి జెండాను ఎగుర వేయడం తథ్యమన్నారు. వైఎస్ వివేకా హంతకులకు ఓట్లేస్తారా అని ప్రశ్నించారు. నాసిరకం వైన్స్ ద్వారా ప్రజారోగ్యాన్ని పాడు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్, కరెంటు, ఆర్టీసీ, చెత్త ఛార్జీలను అమాంతంగా పెంచేశారని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన సుపరిపాలన హామీ ఏమైందన్నారు. గండికోట తెలుగుగంగ, నిర్వాసితులకు పరిహారం చెల్లిస్తామన్నారు. 2014 -2019 టిడిపి హయాంలో 12,050 కోట్లు ఖర్చు చేశామని, వైసిపి హయాంలో ఏమేరకు ఖర్చు చేశారో చెప్పాలని నిలదీశారు. త్వరలో రైతు రాజ్యం రాబోతుందని, రైతులే రాజ్యం చేస్తారని పేర్కొన్నారు. రూ.95 కోట్ల బకాయిలు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లకు ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. దువ్వూరు వాసి అక్బర్‌బాషా భూమిని ముఖ్యమంత్రి బంధువు తిరుపాల్‌రెడ్డి కబ్జా చేయడం పరాకాష్ఠకు చేరుకుందని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే 22 ఎ చట్టాన్ని రద్దు చేస్తామని తెలిపారు. కబ్జాదారులను వదలబోనని హెచ్చరించారు. రైతుల పాసుపుస్తకాలపై బొమ్మలు వేయించుకోవడంతో పిచ్చి పరాకాష్ఠకు చేరుకుందని తెలిపారు. చివరికి వైవియూలోని వేమన విగ్రహాన్ని తొలగించి తన విగ్రహం పెట్టించుకోవడం ఏమిటని ప్రశ్నించారు. చెల్లికి, తల్లికి న్యాయం చేయలేని వ్యక్తి రాష్ట్రానికి ఏమి చేస్తాడని పేర్కొన్నారు. అన్న క్యాంటీ న్లను పునరుద్ధరిస్తామని తెలిపారు. కర్నూలులో హైకోర్టు, విశాఖ, కడప, అనంతపురం జిల్లాలను అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం జిల్లాలోని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే బెట్టింగ్ ప్రసాద్‌గా మారిపోయాడన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి కబ్జాదారిగా మారాడని విమర్శించారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి యాక్టర్‌గా మారిపోయాడని తెలిపారు. బద్వేల్ నాయకులు కబ్జాలకు కేరాఫ్ అడ్రెస్‌గా మారారని విమర్శించారు. డిప్యూటీ సిఎంగా ఉన్న అంజాద్‌బాషా ఉత్సవ విగ్రహంగా మారాడన్నారు. కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి కరెప్షన్ కింగ్‌గా మారాడని విమర్శించారు. ఈయన లేపాక్షి భూముల దగ్గర నుంచి బుగ్గవంక వరకు కబ్జా యత్నం చేశారన్నారు. పోతిరెడ్డిపాడు, నిప్పులవాగు, కెసి కెనాల్ సామర్థ్యా లను పెంచుతామన్నారు. టిడిపి, జనసేన కార్యకర్తలు సమష్టిగా 82 రోజులు గ్రామాల్లో తిరిగి పని చేస్తే మిమ్మల్ని ఆదుకునే బాధ్యత తీసు కుంటానని భరోసా నిచ్చారు. కార్య క్రమంలో అనంత పురం జిల్లాకు చెందిన మాజీమంత్రి కాల్వ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసులరెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు మల్లెల లింగారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వరద రాజులరెడ్డి, విజయమ్మ, మాజీ ఎమ్మెల్సీలు బి.టెక్‌రవి, బత్యాల చెంగల్రాయులు, బచ్చల పుల్లయ్య, రాయచోటి, కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ఇన్‌ఛార్జులు ఆర్.రమేష్‌రెడ్డి, మాధవీరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, ప్రవీణ్ కుమార్‌రెడ్డి, భూపేస్‌రెడ్డి, బద్వేలు యువ నాయకులు రితేష్‌రెడ్డి, వేలాది మంది టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



చంద్రబాబుకు నాగలి అందజేస్తున్న నాయకులు, కార్యకర్తలు



వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

తరగని సంపద వేమన పద్యాలు : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

సామాన్యులకు సైతం అర్థమయ్యేలా తెలుగు భాషను సరళంగా వర్ణించిన ప్రజాకవి యోగి వేమన అని, ఆయన కూర్చిన ఆటవెలది పద్యాలు.. తెలుగు సాహితీ రంగంలో తరగని సంపద అని కలెక్టర్ వి. విజయ్ రామరాజు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో 'యోగి వేమన' జయంతి వేడుకలు కలెక్టర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటవెలది పద్యాల రూపంలో సామాన్య ప్రజానీకానికి అర్థమయ్యే వాడుక భాషలో అద్భుతమైన కవిత్వాన్ని అంది ంచిన ఘనత యోగివేమన సాహితీ ప్రత్యేకత అన్నారు. సామాజిక రుగ్మతలపై, సమాజ సంస్కరణకు కృషి చేసిన గొప్ప దార్శినికుడు వేమన అన్నారు. అంతకుముందు యోగి వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిఆర్ఒ గంగాధర్ గౌడ్, కలెక్టరేట్ ఏవో విజయ్ కుమార్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. **వేంపల్లె :** వేమన మహా కవి, మహా యోగీ, గొప్ప సంఘ సంస్కర్త అని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి కొనియాడారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వేమన జయంతిని పురస్కరించుకుని వేమన చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, బాలం సుబ్బరాయుడు, రెడ్డి సంఘం అభివృద్ధి సొసైటీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, అంజన్‌రెడ్డి, సుబ్రమణ్యం, రామకృష్ణ, రాజా, సత్తార్, నరసింహరెడ్డి, పాల్గొన్నారు.

కార్మిక వర్గానికి దిక్సూచి లెనిన్ : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రపంచంలో మొట్టమొదటి కార్మిక వర్గ రాజ్యం, సోషలిస్టు సమాజం, యూనియన్ ఆఫ్ సోషలిస్ట్ సోవియట్ రష్యా (యు.ఎస్.ఎస్.ఆర్.) 17 దేశాల సమ్మేళనం నిర్మాణం రూప శిల్పి వి.ఐ.లెనిన్ అని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1924, జనవరి 21న మరణించి నేటికి వందేళ్లయిన సందర్భంగా శత వర్ధంతి సభలు ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లాలోని మండల, పట్టణ, నగర, జిల్లా కేంద్రాలలో సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భారతదేశంలో గౌరవంగా జీవించే హక్కు, పనిచేసే హక్కు, పోషక ఆహార హక్కు, విద్యా హక్కు, సామాజిక భద్రత హక్కు, పౌరులకు రాజ్యాంగం కల్పించడానికి 1917 రష్యా విప్లవం, కార్మిక రాజ్యం, సోషలిస్టు వ్యవస్థ మూల సూత్రాలు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భారత రాజ్యాంగంలో పొందుపరచడం ద్వారా దేశ ప్రజలందరికీ అందాయన్నారు. నరేంద్ర మోడీ, బిజెపి ప్రభుత్వం మాటల్లో దేశభక్తిని ప్రదర్శిస్తూ, చేతల్లో దేశ సంపదనంతా కార్పొరేట్ శతకోటీశ్వర్లకు దోచిపెడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి, వైసిపి ప్రభుత్వం జవాబుదారితనం లేకుండా ఏకపక్షంగా పనిచేస్తుందని విమర్శించారు. జగన్ రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆధునిక ధనిక వర్గాన్ని ఎన్నికల్లోకి లాగడానికి వారి ద్వారా ధనస్వామ్యం ఎన్నికలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు మేల్కొని బుద్ధి చెప్పాలన్నారు.



లోక నితిన్‌కుమార్‌రెడ్డిని అభినందిస్తున్న ప్రిన్సిపల్

విద్య, క్రీడల్లో రాణించడం అభినందనీయం

ప్రజాశక్తి - కడప అర్బన్

శ్రీ చైతన్య అకాడమి జూనియర్ కళాశా లలో ఎంపిసి మొదటి సంవత్సరం చదువుతున్న వై.లో క నితిన్ కుమార్‌రెడ్డి విద్యతో పాటు క్రీడల్లో రాణించడం అభినందనీయమని ప్రిన్సిపల్ రమేష్ అన్నారు. శుక్రవారం జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థిని అభినం దించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యా ర్థులు అన్నిరంగాల్లో రాణించాలని పేర్కొన్నారు. విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ మల్లికార్జున అన్నివిధాలుగా ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. కళాశాలలో చదువుతున్న నజీర బేగం హాకీలో జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్నారని తెలిపారు. కోచ్ వెంకటేష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యం సహకారంతో మార్షల్ ఆర్ట్స్‌లో లోకనితిన్ కుమార్‌రెడ్డి ప్రతిభ చూపుతున్నారని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఆర్.సి.నాయుడు, లోకనితిన్ తండ్రి వై.నాగిరెడ్డి పాల్గొన్నారు.

తక్షణమే ఐఆర్‌ను ప్రకటించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వం పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేసిన తరువాత ఎటువంటి పురోగతి లేదని, ముఖ్యమంత్రి స్వయంగా జోక్యం చేసుకుని కనీసం ఐఆర్‌ను తక్షణం ప్రకటించాలని ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున కోరారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఆర్‌సి, డిఎ బకాయిలు ఇప్పటి వరకు చెల్లించలేదని తెలి పారు. వెంటనే చెల్లించాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టి వర్గాలపై జరుగుతున్న దాడుల పట్ల ప్రభుత్వం స్పందిస్తే ఆ మహనీ యుడికి ఘనమైన నివాళి అర్పించినట్లు అవుతుందని చెప్పా రు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శేషగిరిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాజు, కార్యదర్శి గంగాధర్ పాల్గొన్నారు.

ఘనంగా వరుణ్‌తేజ్ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - కడప అర్బన్

చిరంజీవి యువత జిల్లా అధ్యక్షులు పండ్రా రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాజా సినిమా హాలులో బాణసంచా పేలుస్తూ బ్యాండ్ బాజాలతో మెగా అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. ప్రేమాలయ వృద్ధాశ్రమంలో రాజగోపాల్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ దుర్గా సంస్థల అధినేత దుర్గాప్రసాద్ అన్నాదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో దినేష్, వెంకటేష్, ముని, బాలు నాయక్, కుమార్ నాయక్, సుధీర్ నాయక్, రాజశేఖర్, విగ్నేష్, మౌలాలి, సాయికృష్ణ, రామకృష్ణ పాల్గొన్నారు.



వరుణ్‌తేజ్ పుట్టినరోజు వేడుకల్లో పండ్రా రంజిత్‌కుమార్



సంతకాల సేకరణలో ఎల్ఐసి ఉద్యోగులు, నాయకులు

ప్రీమియంపై జిఎస్‌టిని తొలగించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

రూ.42 లక్షల కోట్ల నిల్వలతో ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద జీవిత బీమా సంస్థ ఎల్ఐసి అని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం కడప డివిజన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి అన్నారు. శుక్రవారం 67వ జీవిత బీమా జాతీయకరణ దినోత్సవం సందర్భంగా కడప, ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్ లో ఏర్పాటుచేసిన 'సంతకాల సేకరణ కార్యక్రమం' సందర్భంగా వారు మాట్లాడారు. ఎల్ఐసిని ప్రభుత్వరంగ సంస్థగా మరింత బలోపేతం చేయాలని, బీమా ప్రీమియంలపై విధించిన జిఎస్‌టిని పూర్తిగా తొలగించాలని, బీమా పొదుపు మొత్తాలకు ప్రత్యేకంగా ఆదాయం పన్ను రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సంతకాల సేకరణ చేపట్టి ప్రజల మద్దతు కూడగడుతున్నామని తెలిపారు. సంతకాలు చేసిన వారిలో ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగసుబ్బారెడ్డి, సిరికల్చర్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటరామరాజు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓబులేసు, పెన్షనర్ల సంఘం నేతలు శంకరరావు, సుధీకర్, చంద్రశేఖర్ రెడ్డి, ఎల్ఐసి యూనియన్ల నేతలు అక్బర్, రాజు, అయ్యవారు రెడ్డి, కుమార్, జయచంద్ర, నరసయ్య, చిన్నయ్య, శీను, సుబ్బారెడ్డి, కిషోర్, ఖాన్, రాజేంద్ర ఉన్నారు.

మహనీయుల పేర్లు అవమానిస్తే సహించబోం : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రపంచ మేధావులైన కార్ల్‌మార్క్స్, లెనిన్ పేర్లను అవమానిస్తే సహించేది లేదని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. ఇటీవల గుంటూరుకారం సినిమాలోని మహనీయుల పేర్లు విలన్లకు పెట్టి అవమానించిన చిత్ర దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కడప పూలే సర్కిల్ లో త్రివిక్రమ్ శ్రీనివాస్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ గతిని మార్చిన గొప్ప చరిత్ర నిర్మాత కార్ల్‌మార్క్స్ దోపిడీపై చిరు ప్రాయంలోనే ప్రపంచ వ్యాప్తంగా కార్మిక వర్గ రాజ్య స్థాపన కై త్యాగాలు చేశారని పేర్కొన్నారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ డబ్బు సంపాదన పరమావధిగా చరిత్రను వక్రీకరించి ప్రజలను పక్కదారి పట్టించడాన్ని డివైఎఫ్ఐ యువజన సంఘం తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. విలన్లకు పెట్టిన మార్క్స్ లెనిన్‌ల పేర్లను వెంటనే తొలగిం చాలని చరిత్రను వక్రీకరించిన త్రివిక్రంపై ప్రభుత్వం చట్టరీ త్యా చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు, నాయకులు పవన్, ఉదయ్, మాజీ డివైఎఫ్ఐ నాయకుడు వెంకటేష్ పాల్గొన్నారు.



త్రివిక్రమ్ శ్రీనివాస్ చిత్రపటాలను దహనం చేస్తున్న నాయకులు



మాట్లాడుతున్న ఇజిపిఆర్‌డి మల్లికార్జునరెడ్డి

అభివృద్ధి పనులకు ప్రణాళికలు

ప్రజాశక్తి - వేంపల్లె

గ్రామ పంచాయతీలలో ప్రాథమిక అవసరాలను గుర్తించి సదుపాయాలు కల్పించేందుకు అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని ఇజిపిఆర్‌డి మల్లికార్జునరెడ్డి గ్రామ సచివాలయ సిబ్బందిని సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమీపంలోని సభా భవనంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ అభివృద్ధి ప్రణాళికపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సిబ్బందితో మహిళా అభివృద్ధిపై నిర్వహిస్తున్నా శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికలను పకడ్బందీగా రూపొందించాలని కోరారు. గ్రామాల్లో పనిచేస్తున్న ఆయా శాఖల సిబ్బంది అందరూ సమన్వయం చేసుకుని గ్రామ సభలను నిర్వహించి ప్రణాళిక రూపొందించాలని కోరారు. ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామసభలను నిర్వహించి, శిశు, మహిళా అభివృద్ధి, ఆరోగ్యం అంశాలపై ప్రజాప్రతినిధులు, ప్రజలతో కలిసి చర్చించాలని కోరారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, రోడ్లు, భవనాల నిర్మాణాలు, త్రాగునీరు, వ్యవసాయం, ఇతర రంగాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పై అధికారులు దృష్టి సారించాలని కోరారు. అభివృద్ధి పనుల తీరును కూడ అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సంపతి దివిజా, గ్రామ సచివాలయం సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పంట పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

లవణ శాతం అధికంతోనే ఎదుగుదల సమస్య

ప్రజాశక్తి -ఖాజీపేట

భూమిలో లావణ శాతం అధికంగా ఉండడం వల్లే నారు ఎదుగుదల లేకపోవడానికి కారణమని వ్యవసాయపరిశోదన కేంద్రం ఉన్నతాధికారులు డాక్టర్ శ్రీనివాసులు, జాన్సన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలం పరిధిలోని రావులపల్లె, చెముళ్ల పల్లె గ్రామాల్లో సాగు చేసిన వరి పంటను స్తానిక వ్యవసాయ అధికారి నాగార్జునతో కలిసి పరిశీలించారు. రబీలో వరి రైతులు ఆర్‌ఎన్‌ఆర్ 15048 రకం వరి ఎదుగుదలకు తక్కువగా ఉందని దీనికి కారణం సాగు నీటిలో, నెలలో లవణాల శాతం ఎక్కువ గా ఉందని పేర్కొన్నారు. లవణాలను తట్టుకునే రకాలు వేయకపోవడం, నెలలో భాస్వరం ఎరువులు ఎక్కువ గా వినియోగించడం పోటాషియం, జింక్ లోపం వల్ల ఎదుగుదల తక్కువగా ఉందన్నారు. నివారణ కోసం తగిన సస్య రక్షణ చెర్యలు చేపడితే మంచి ఫలితాలు పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయ అధికారి వెంకట కుమార్ గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలిపించండి

ప్రజాశక్తి - కడప అర్బన్



కరపత్రాలు అందజేస్తున్న సలావుద్దీన్

మన ఊరి, ప్రజల సమస్యలు తీరాలంటే ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఎన్నికల్లో గెలిపించాలని సయ్యద్ సలావుద్దీన్‌ను ప్రజలను కోరారు. శుక్రవారం నగరంలోని జుమ్మా మసీదు వద్ద తన ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరంలోని అనేక సమస్యలు నెలకొన్నాయని అవి తీరాలంటే రాబోయే ఎన్నికల్లో ప్రజలందరూ తనకు ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలిపించాలన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు తమ స్వార్థరాజకీయాల కోసమే పనిచేస్తున్నాయని , ప్రజల సమస్యలను ఎవరు కూడా పట్టించుకోవడం లేదన్నారు. ఈనెల 21 నుంచి కడప నగరంలో విస్తృతంగా తన ప్రచారాన్ని చేపడుతున్నాని వెల్లడించారు. కార్యక్రమంలో శివ చంద్ర, షబ్బీర్, జావిద్, రఖైబ్ పీరా, షాబు గోల్డ్, మౌలా పాల్గొన్నారు.

కాంక్రీట్ వేశారు.. నీరు మరిచారు

ప్రజాశక్తి కొండాపురం



నీరు పట్టని కాల్వ

మండల కేంద్రంలో చేపడుతున్న జాతీయ రహదారి 67 పనుల్లో అనేక అవకతవకలు చోటు చేసుకుంటున్నాయనే ఉన్నాయి. అధికారులు మాత్రం చోద్యం చూసున్నారు. ప్రతి పనిలోను మట్టి మొద లుకొని ఉచితంగా లభించే నీటి వరకు నాశిరంగా చేపడుతున్నారనే ఆరోపణలు బలంగా విన్పిస్తున్నాయి. పత్రికలలో వచ్చినప్పటికీ జాతీయ రహదారి అధికారుల్లో చలనం కలగడం లేదు. జాతీయ రహదారి పనుల్లో భాగంగా చేస్తున్న డ్రెయినేజీ పనుల్లో నాసిరకం పనులు చేస్తున్నారని చెప్పడానికి మరో నిదర్శనంగా మారింది. డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేసిన కాంక్రీట్‌లో నాణ్యత లేకపోవడంతోపాటు చివరకు నీరు కూడా పట్టడం లేదు. చూడటానికి కాంక్రీట్ గోడలపై పట్టలు కప్పి నీరు పట్టినట్లు ప్రజలను మభ్యపెడుతున్నారు. కాంక్రీట్ గోడలకు తగిన మోతాదులో నీరు పట్టకపోతే ఆ గోడలు త్వరగా కూలిపోయె ప్రమాదం ఉందని పలువురు వాపోతున్నారు. పైగా ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని పేర్కొన్నారు. ఇప్పటి కైనా సంబంధిత జాతీయ రహదారి అధికారులు నాసిరకం పనులు జరగకుండా ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్రైం కార్నర్

46 మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి - చాపాడు : మండల పరిధిలోని పల్లవోలు సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 46 మద్యం బాటిళ్లను పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ ఆర్‌వి కొండారెడ్డి అందించిన వివరాల ప్రకారం.. శుక్రవారం ప్రొద్దుటూరు మండలం బొజ్జవారిపల్లికి చెందిన చిన్న గూడూబాయ్ గారి రహంతుల్లా అక్రమ మద్యాన్ని తరలిస్తూ ఉండగా తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సూచించారు.

వేంపల్లెలో 25 బాటిళ్లు...

వేంపల్లె : ఆక్రమంగా తరలిస్తున్న 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. శుక్రవారం సిఐ చాంద్ బాషా ఆదేశాల మేరకు వేంపల్లెలో తనిఖీలు చేపట్టారు. దీంతో పెండ్లిమర్రి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన గరిశ లక్ష్మిణారెడ్డి అనే వ్యక్తి ఉర్దూ షాదీఖానా సమీపంలో 25 మద్యం బాటిళ్లను తీసుకొని వెళ్లుతుండగా వాటిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న వారిలో కానిస్టేబుళ్లు కిరణ్, వీరన్న పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కడప అర్బన్



మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లాలో కొత్త పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను మరింత ప్రోత్సహించాలని కలెక్టర్ వి. విజయ రామరాజు డిఐఇపిసి సభ్యులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు విస్తృతమైన అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఉన్న అవకాశాలను సద్వినియోగిస్తూ పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్టం చేయాలన్నారు. పరిశ్రమలు జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయువు పట్టు అని తెలిపారు. ఆ దిశగా జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని సూచించారు. జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని విస్తృతం చేసి, జిల్లా ఆర్థిక అభివృద్ధితో పాటు, నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వాలన్నారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడుగిడాలనుకున్న వారికి ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించేలా బ్యాంకర్లు సహకరించాలన్నారు. ముఖ్యంగా ఎస్సి, ఎస్టి ఔత్సాహిక నూతన పారిశ్రామికవేత్తలను ఎదిగేందుకు ప్రోత్సహించాలన్నారు. పరిశ్రమల ప్రమోషన్‌కు సంబంధించి ఇంకా ఏవైనా దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లా స్థాయి నుంచి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యువతకు పారిశ్రామిక పెట్టుబడులు, యూనిట్ల స్థాపనపై అవగాహన పెంపొందించాలన్నారు. పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మి సంబంధిత వివరాలను సమావేశంలో కలెక్టర్‌కు వివరించారు. ఆయా అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో ఎపిఐఐసి జెడ్‌ఎం నాగరాజు, డిక్కీ కో-ఆర్డినేటర్ శివ శంకర్, ఎపిఐఐసి ప్రతినిధులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ, వాణిజ్య పన్నుల శాఖ, ఎపిఎస్ పిడిసిఎల్, లేబర్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరిన 'గంగవరం'

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

వైసిపి రెబల్ నాయకులు గంగవరం శేఖర్ రెడ్డి శుక్రవారం చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపిలో చేరారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి సమీప బంధువైన గంగవరం శేఖర్ రెడ్డి 2019 ఎన్నికల్లో సుధీర్ రెడ్డి గెలుపు కోసం తన వంతు కృషి చేశారు. ఎన్నికల అనంతరం చోటు చేసుకున్న పరిణామాల కారణంగా ఇరువురికి బేదాభిప్రాయాలు రావడంతో సుధీర్ రెడ్డికి దూరంగా ఉంటూ వచ్చారు. వైసిపి పార్టీని వీడకుండా సుధీర్ రెడ్డిపై అసమ్మతిగా ఉన్న నేతలను కలుస్తూ వారిని ఒక్కటి చేసే ప్రయత్నాలు చేశారు. నియోజకవర్గంలో తిరుగుతూ, అసమ్మతినేతలను కలుస్తుండడంతో సహించలేని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి జిల్లా వైసిపి అధ్యక్షులు సురేష్ బాబుతో గంగవరం శేఖర్ రెడ్డికి వైసిపికి ఎటువంటి సంబంధం లేదు అని ప్రకటన ఇప్పించారు. దీంతో వైసిపి పార్టీకి కూడా దూరంగా ఉంటూ సొంత గ్రూపును తయారు చేసుకుంటూ వారికి అండగా ఉంటూ వచ్చారు. జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి, పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవి ఆహ్వానం మేరకు వారి ఆధ్వర్యంలో శుక్రవారం" రా కదలిరా' కార్యక్రమానికి కమలాపురానికి విచ్చేసిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో పసుపు కండువా కప్పుకొని టిడిపిలో చేరారు.



గంగవరం శేఖర్‌రెడ్డిని కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

నాస్తిక మేళాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలో చార్వాక ఆశ్రమంలో ఫిబ్రవరి 10,11 తేదీలలో 32వ జాతీయ నాస్తిక సమ్మేళాన్ని జయప్రదం చేయాలని విరసం నాయకులు వరలక్ష్మి భారతీయనాస్తిక సమాజం నాయకులు సృజన శీను పల్లవోలు రమణ కోరారు. స్థానిక సృజన కార్యాలయంలో శుక్రవారం మేళా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత సంస్కృతి ప్రభావంతో మనదేశంలోని పండుగలన్నింటిలో దైవభావన ప్రవేశించిందని రుతువుల క్రమంలో ప్రకృతి మార్పుల క్రమంలో వచ్చే పండుగలకు కూడ మతభావాలను అంటగట్టారని తెలిపారు. ప్రత్యామ్నాయ సంస్కృతిలో భాగంగా మనం నిర్వహించే మేడే అక్టోబర్ విప్లవంలాంటి వాటికి తోడుగా దేశీయ ప్రజాసంస్కృతిలో భాగంగా నాస్తికమేళా పండుగను రూపొందించినట్లు అన్నారు. భారతీయ తత్వశాస్త్రంలో భావవాదం లౌకికవాదము రెండు ఉన్నాయని అన్నారు. నాస్తిక ఉద్యమం అంటే కేవలం దైవబావాన్ని తిరస్కరించడమే కాకుండ వాస్తవికమైన మోసపూరితమైన దోపిడీ భావజాల ప్రాతిపదికపై నిర్మితమైన అమానవీయమైన సామాజిక వ్యతస్థల్ని కూలదోసి సమతా మానవసమాజ నిర్మాణ కృషిలో తన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించేదే నాస్తిక ఉద్యమం అన్నారు. చార్వాక ఆశ్రమం ఏర్పడి 50 ఏళ్ల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని ఇర్వాహకులు భావిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పలువురు రచయితలు మేధావులు హేతువాదులు వామపక్ష ప్రజాతంత్ర వాదులు పాల్గొని ప్రసంగిస్తారని అన్నారు. ప్రజాకళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో దళిత సమాఖ్య నాయకులు యల్లయ్య, కవి మహమూద్ రాయలసీమ మహిళాశక్తి నాయకురాలు లక్ష్మిదేవి ప్రసన్న ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు హరి ఓబన్న జయచంద్ర పాల్గొన్నారు.

చట్టాల పట్ల అవగాహన అవసరం

ప్రజాశక్తి - కడప

కార్మికులు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు సూచించారు. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ బాబా ఫక్రుద్దీన్ ఆదేశాల మేరకు శుక్రవారం కడప నగరంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న పవన్ కెమికల్స్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులచే న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ చట్టాలు, నీటి ప్రాముఖ్యత, కార్మికులు ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన కలిగి ఉండాలి, పనిచేసే చోట తప్పనిసరిగా ఇపిఎఫ్, ఇఎస్ఐ సదుపాయాలు కలిగించేలా యాజమాన్యం చూసుకోవాలి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం గురించి వివరించారు. లీగల్ ఎయిడ్ క్లినిక్, లోకాయుక్త, కార్మికులు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలి మొదలగు అంశాలను వివరించారు. ఏమైనా సమస్య ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడపను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో శాంత, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, పి.మనోహర్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, పారా లీగల్ వాలంటీర్ ఎన్.దశరథ రామిరెడ్డి, పవన్ కెమికల్స్ మేనేజ్మెంట్, కార్మికులు పాల్గొన్నారు.

ముగిసిన సంకల్పయాత్ర


ప్రజాశక్తి-కొండాపురం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ రకాల పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఈనెల 5న ప్రారంభమైన భారత సంకల్పయాత్ర శుక్రవారంతో ముగిసింది యాత్రలో సహకరించిన పెద్దలకు అధికారులకు ప్రజలకు రైతు నాయకుడు ఇరగం రమణారెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు

జనసేన కూటమిని ఆదరించాలి

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

పవన్‌కళ్యాణ్ నాయకత్వంలోని జనసేన కూటమిని ప్రతి ఒక్కరూ ఆదరించాలని జనసేన పార్టీ నాయకులు అతికారి కృష్ణ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఆయన మండల పరిధిలోని పెద్దకొత్తపల్లి, నరసనగారిపల్లెల్లో ఆత్మీయ పలకరింపులో భాగంగా పర్యటించారు. గ్రామస్తులు, జనసైనికులు బాణాసంచా పేలుస్తూ ఆయనకు ఘనస్వాగతం పలికారు. మహిళలు నీరాజనాలు పలుకుతూ పూలవర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ నాయకత్వంలో బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. వైసిపి వచ్చాక అరాచక పాలన ప్రారంభమైందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి పూర్తిగా సహకరిస్తామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో జనసేన, తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడం తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు, జనసేన కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



జనసేన నాయకుడు అతికారి కృష్ణకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

మహిళా విభాగం ఎన్నిక

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎపి జెఎసి అమరావతి జిల్లా మహిళావిభాగం ఆవిర్భావ సమావేశం శుక్రవారం జిల్లా ఎపిజెఎసి అమరావతి జనరల్ సెక్రటరీ కె. కృష్ణ కుమార్ అధ్యక్షతన శుక్రవారం కడప రెవెన్యూ భవన్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళావిభాగం కమిటి ఎన్నిక చేపట్టారు. జిల్లా మహిళావిభాగం చైర్ పర్సన్‌గా ఎం.మేరీ విజయకుమారి (రెవెన్యూ), ప్రధాన కార్యదర్శి గా పి.విజయమ్మ(ఆర్టీసీ) కోశాధికారిగా ఓ. కమల కో - ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్, సుజాత సెక్రటరీగా ,ఎ.శారద దేవి, శిరీష, పద్మావతి కో - చైర్ పర్సన్ గా, ప్రియాంక, విజయమ్మను సెక్రటరీలుగా ఎన్నుకున్నారు. వీరితోపాటు వివిధ డిపార్టు మెంటులకు చెందినవారితో మొత్తం 13 మందితో జిల్లా అమరావతి జెఎసి మహిళా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర సెక్రెటరీ జనరల్ పలిశెట్టి దామోదర్, ఎపి పిటిడి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ నరసయ్య, రాష్ట్ర మహిళా విభాగ చైర్ పర్సన్ పారేలక్ష్మి, ప్రధానకార్యదర్శి పొన్నూరు విజయలక్ష్మి, అసోసియేట్ చైర్ పర్సన్ సైకం శివకుమారి రెడ్డి, గంటా పావని, వివిధ సంఘ నాయకులు, అధికసంఖ్యలో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి తప్పనిసరి

ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్

శనగ పంటలో విత్తన శుద్ధి తప్పనిసరని వ్యవసాయాధికారులు శివ శైలజ, పద్మజ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని శేషారెడ్డి పల్లెలో మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో విత్తనోత్పత్తి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన ధ్రువీకరణ విత్తనాలను రైతులకు అందుబాటులో తీసుకొచ్చేందుకు ప్రభుత్వం వితనోత్పత్తి కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. శనగ పంట వేసే సమయంలో విత్తన శుద్ధి చేయడం వల్ల తెగుళ్లను నివారించవచ్చని పేర్కొన్నారు. శనగ పంటలో పచ్చ పురుగును నివారించేందుకు అంతర పంటలైన ఆవాలు, ధనియాలు 8:2 నిష్పత్తిలో వేసుకోవాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో చెప్పిన విషయాలను రైతులు ప్రతి ఒక్కరు పాటిస్తే అధిక దిగుబడిని సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో రైతు శిక్షణ వారు, గ్రామ సర్పంచ్ గురు శేఖర్ రెడ్డి, వి.ఎ ఎ గిరీష్ కుమార్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గురవి రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయానికి నాంది పలికింది వైసిపినే : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

సామాజిక న్యాయం సామాజిక విప్లవానికి నాంది పలికింది వైసిపినే అని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి జగన్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక సమతా సంకల్ప సభకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శుక్రవారం కార్యకర్తలు నాయకులు బయల్దేరారు. స్థానిక రాజన్న ఉచితభోజన శాల వద్ద బస్సులను వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.440కోట్ల ఖర్చుతో 19 ఎకరాల విస్తీర్ణంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 206 అడుగుల సామాజిక న్యాయమహాశిల్పం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఎదురుగ ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. భారతరాజ్యాంగం ప్రపంచదేశాల్లోకెల్లా గొప్పదని అంతటి గొప్ప రాజ్యాంగాన్ని మనకు అంబేద్కర్ అందిం చారన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు దళితసంఘ నాయకులు పాల్గొన్నారు.

ఎర్రబల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా మండల పరిధిలోని ఎర్రబల్లి గ్రామ సచివాలయం-2లో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో వైద్యులు 401 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐదు గ్రామాలకు చెందిన ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఎంపీడీవో వేంకటేశ్వర్లు, నల్లపురెడ్డి పల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్.లిఖితతో పాటు స్పెషలిస్ట్ డాక్టర్లు ముగ్గురు, గ్రామాల పరిధిలోని వైద్య, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

నేడు పిసిసి అధ్యక్షులు షర్మిల జిల్లాకు రాక

ప్రజాశక్తి - కడప

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమితులైన వైఎస్ షర్మిల రెడ్డి ఈనెల 21న విజయవాడలో పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ నేపథ్యంలో తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశీర్వాదాలు తీసుకునేందుకు ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఘాట్ వద్దకు శనివారం రానున్నారు. హైదరాబాదు నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి మధ్యాహ్నం రెండు గంటలకు ఇడుపులపాయకు చేరుకుంటారు. సాయంత్రం నాలుగు గంటలకు వైఎస్ఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల ఇడుపులపాయ వస్తున్న సందర్భంగా వైయస్సార్ కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున షర్మిల కు స్వాగతం పలికేందుకు ఇప్పటికే ఏర్పాట్లు సిద్ధం చేశారు.



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

వరి పంట పరిశీలన

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో పెన్నా, కుందూనది పరివాహక ప్రాంతంలో రబీ సీజన్‌లో సాగు చేసిన వరి పంట ఎండిపోతున్న నేపథ్యంలో శుక్రవారం నక్కలదిన్నె వద్ద ఎండిన వరి పంటలను మండల వ్యవసాయాధికారి మ్యాగీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రెండవ సారి సాగు చేసిన వరిపంట ఎండుతున్నది, రైతులు ఎకరాకు 40కేజీల యూరియా, 29కేజీల పోటాషియం వేయాలని తెలిపారు. రైతుల సూచనల మేరకు వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలను పంటల పరిశీలనకు పంపాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి సూచించామని తెలిపారు. రైతులు వేసవిలో వరి సాగు స్థానంలో ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని తెలిపారు. అలాగే పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విఎఎ, రైతులు పాల్గొన్నారు.

ఓటును నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని తహశీల్దార్ గురప్ప పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన ఓటింగ్ వైపు యువత పయనించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకొని, ఓటు హక్కును ఎన్నికలలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపిలో 30 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పెద్దముడియం మండలం బోడి తిప్పనపాడు గ్రామానికి చెందిన 30 కుటుంబాలు శుక్రవారం ఉదయం జమ్మలమడుగు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి సి.భూపేష్ సుబ్బరామి రెడ్డి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా భూపేష్ రెడ్డి మాట్లాడుతూ బి.టి పాడు గ్రామ ప్రజలు పార్టీలో చేరడం శుభ పరిణామం అన్నారు. గ్రామంలో పార్టీ అభివృద్ధితో పాటు, పార్టీ గెలుపుకు కృషి చేయాలని కోరారు. చేరిన వారిలో మాధవరెడ్డి, నరాల రామసుబ్బారెడ్డి, బాలరాజు, వెంకటరాముడు, సి. హుస్సేన్ వల్లి, వై.శ్రీనివాసులు, చిన్న రామయ్య, సుభహన్, సుబ్బయ్య, రుద్రయ్య ఉన్నారు.

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలోని శ్రీశ్రీ నగర్‌కు చెందిన మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యురాలు షేక్ సాధకున్, ఆమె భర్త చిన్న సేట్ తమ అనుచరులతో కలిసి జమ్మలమడుగు టిడిపి ఇన్చార్జి భూపేష్ రెడ్డి సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. సాధకున్ తమ కో - ఆప్షన్ పదవికి రాజీనామా చేస్తూ పత్రాన్ని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ కు అందజేశారు. అలాగే మండలంలోని మాలెపాడు, వలసపల్లి గ్రామాలకు చెందిన పలువురు టిడిపిలో చేరారు. ముద్దనూరు మండలానికి చెందిన జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సొంత మేనమామ కుడుముల శశిధర్ రెడ్డి కూడా టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. టిడిపిలో చేరిన నాయకులందరినీ భూపేష్ రెడ్డి దగ్గరుండి చంద్రబాబు నాయుడుకు పరిచయం చేశారు. చంద్రబాబు నాయుడు అందరికీ అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరూ శ్రమించి భూపేష్ రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని చంద్రబాబు వారిని కోరారు.

చెట్లు నరికిన వారిపై చర్యలేవీ?

ప్రజాశక్తి- కాశినాయన

మండల పరిధిలోని పిట్టిగుంటలో నాలుగు చింత చెట్లు అక్రమంగా ప్రభుత్వ స్థలంలో ఉంటే అధికార పార్టీ నాయకులు వాటిని నరికేశారు. స్థానికు కొందరు ఈ విషయాన్ని తహశీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. పత్రికల్లోనూ కథనాలు వచ్చాయి. రెవెన్యూ అధికారులు కానీ ఫారెస్ట్ అధికారులు కానీ ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరం. ప్రజల బాధలను అధికారులు పట్టించుకోకుండా నాయకులు చెప్పిందే వేధంగా విధులు నిర్వహిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకుని పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

కులగణన పక్కాగా చేపట్టాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి- వేంపల్లె

ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో కులగణనను గ్రామ సచివాలయం సిబ్బంది పక్కాగా చేపట్టాలని ఎంపిడిఒ సంపతి దివిజా అన్నారు. శుక్రవారం స్థానిక గండి రోడ్డులోని ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయం సమీపంలో కులగణన సర్వేను ఎంపిడిఒ సంపతి దివిజా ప్రారభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామ సచివాలయాల్లో కులగణన సర్వే వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బడుగు, బలహీన, వర్గాలకు ఆర్థిక రాజకీయ సాధికారత కల్పిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పది రోజులపాటు కులగణన సర్వేను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామ వార్డు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు ఉమ్మడిగా ఇళ్లు వద్దకు వెళ్లి కులాల వారీగా వివరాలను సేకరించనున్నారని తెలిపారు. కులగణన ప్రక్రియను ఆన్ లైన్ విధానంలో పారదర్శకంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ వార్డు సిబ్బంది, వాలింటీర్లు పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల** : ఎర్రగుంట్ల పట్టణ పరిధిలో నిర్వహిస్తున్న కులగణన సర్వేకు పట్టణ ప్రజలు పూర్తి సహకారం అందించాలని మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలియజేశారు. సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి కులగణన సర్వే చేస్తునన్నారని వారికి అవసరమైన అన్ని వివరాలు తెలిజేశారు. ఈ సందర్భంగా 8వ సచివాలయ పరిధిలో 17వ వార్డులో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో 17 వార్డు కౌన్సిలర్ ఎరుకలరెడ్డి, ఆర్ఒ గంగిరెడ్డి, నోడల్ ఆఫీసర్ ప్రవీణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ప్రజాశక్తి **పులివెందుల టౌన్ :** రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న కుల గణన సర్వేలో దేశంలోని ఆదర్శమని వైసిపి ఇన్‌ఛార్జి మనోహర్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో చేస్తున్న కుల గణన సర్వేను కమిషనర్ నరసింహా రెడ్డితో కలిసి శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్ష్మీ భార్గవి, మున్సిపల్ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గౌరవ నాల్గవ అదనపు జిల్లా జడ్జి కోర్టు, కడప

O.S.No. 59/2022

ఊరిబిండి నాగ మహేశ్వరరెడ్డి, తండ్రి వి.గోవిందరెడ్డి, వయస్సు 49 సం॥లు, వ్యాపారం, హిందూ, నివాసం డోర్ నెం.39/594-3,4,రెవెన్యూ వార్డు నెం.39, అరవిందనగర్, కడప నగరం, వై.యస్.ఆర్.జిల్లా. ...వాది

Vs

సయ్యద్ అంజద్ అలి, తండ్రి యం.డి.జాఫర్, ముస్లిం, వయస్సు 43 సం॥లు, జూనియర్ అసిస్టెంట్, జిల్లా పరిషత్ ఆఫీస్, కడప, నివాసం డోర్ నెం.21/523, పాలెం పాపయ్య వీధి, కడప నగరం, ప్రస్తుతం నివాసం డోర్‌నెం.21/580-పైన, పాలెంపాపయ్య వీధి, కడప నగరం, వై.యస్.ఆర్. జిల్లా. ...ప్రతివాది

నోటీసు

పై నెంబరు గల దావాలో ప్రతివాది అయిన నీ పైన దావా డబ్బుల రాబట్టుకొనుటకు వాది సివిల్ కేసు దాఖలు చేసియున్నారు. నీవు నోటీసులు తీసుకొనకపోవడం వలన రాజశ్రీ కోర్టు వారు పేపరు ప్రకటన కోరియున్నారు. కావున 01-02-2024 తారీఖున ఉదయం 10.30 గం॥లకు పై తెలిపిన కోర్టు యందు నీవు గానీ, నీ తరపున వకీలు గానీ, హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకొనవలెయును. లేనంతట నీ పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేది: 01-02-2024

పి.రఘునాధ రెడ్డి
వి.శివగోపాల్ రెడ్డి
న్యాయవాదులు, కడప.సెల్ నెం. 9440883500.

మహారాజశ్రీ గౌరవ నాల్గవ అదనపు జిల్లా జడ్జి కోర్టు, కడప

I.A.No. 1067/2022
O.S.No. 59/2022

ఊరిబిండి నాగ మహేశ్వరరెడ్డి, తండ్రి వి.గోవిందరెడ్డి, వయస్సు 49 సం॥లు, వ్యాపారం, హిందూ, నివాసం డోర్ నెం.39/594-3,4, రెవెన్యూ వార్డు నెం.39, అరవిందనగర్, కడప నగరం, వై.యస్.ఆర్.జిల్లా. ...పిటిషనరు/వాది

Vs

సయ్యద్ అంజద్ అలి, తండ్రి యం.డి.జాఫర్, ముస్లిం, వయస్సు 43 సం॥లు, జూనియర్ అసిస్టెంట్, జిల్లా పరిషత్ ఆఫీస్, కడప, నివాసం డోర్ నెం.21/523, పాలెం పాపయ్య వీధి, కడప నగరం, ప్రస్తుతం నివాసం డోర్‌నెం.21/580-పైన, పాలెంపాపయ్య వీధి, కడప నగరం, వై.యస్.ఆర్. జిల్లా. ...రెస్పాండెంట్లు/ ప్రతివాది

నోటీసు

పై నెంబరు గల దావాలో రెస్పాండెంటు/ప్రతివాది అయిన నీ పైన దావా డబ్బుల రాబట్టుకొనుటకు పిటిషనరు/వాది సివిల్ కేసు దాఖలు చేసియున్నారు. పై దావా డబ్బులు రాబట్టుకొనుటకు ప్రతివాది అయిన నీ స్థిరాస్తిపైన వాది అటాచుమెంటు కోరియున్నారు. నీవు నోటీసులు తీసుకొనకపోవడం వలన రాజశ్రీ కోర్టు వారు పేపరు ప్రకటన కోరియున్నారు. కావున 01-02-2024 తారీఖున ఉదయం 10.30 గం॥లకు పై తెలిపిన కోర్టు యందు నీవు గానీ, నీ తరపున వకీలు గానీ, హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకొనవలెయును. లేనంతట నీ పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేది: 01-02-2024

పి.రఘునాధ రెడ్డి
వి.శివగోపాల్ రెడ్డి
న్యాయవాదులు, కడప.
సెల్ నెం. 9440883500.